బర్డ్ డైరెక్టర్‌గా...

రేపు డాక్టర్ జగదీష్ బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

బర్డ్ ఆసుపత్రి డైరెక్టర్ గా డాక్టర్ గుడారు జగదీష్ బుధవారం బాధ్యతలు చేపట్టనున్నారు. గతంలో బర్డ్ ఆసుపత్రి డైరెక్టర్ గా విధులు నిర్వహించిన ఆయన రిటైర్మెంట్ అనంతరం రాష్ట్రవ్యాప్తంగా పలు ఆస్పత్రుల్లో తన సేవలు అందిస్తున్నారు. ఈ నేపథ్యంలో మరోసారి బర్డ్ డైరెక్టర్ గా రాష్ట్ర ప్రభుత్వం డాక్టర్ జగదీష్‌ను నియమించింది. ఈనెల 28వ తేదీ బుధవారం ఉదయం 9.15 నిమిషాలకు బాధ్యతలు చేపట్టనున్నారు.

సాగు దిగు 'బడి' లేక రాక

సా..గుతున్న 'భూ సార' పరీక్షలు

ఫలితాల కోసం నిరీక్షణ

అధిక పంట దిగుబడులు సాధించేందుకు రైతులు పోటీ పడి మరీ ఎరువులు వేస్తున్నారు. అయినా నష్టాలే రైతులను పలకరిస్తున్నాయి.. వెక్కిరిస్తున్నాయి. భూమిలో పోషక లోపాలు గుర్తించకుండా, వేసిన పంటలే వేయడం..అధిక మోతాదులో ఎరువులు చల్లడం వల్ల పంటలపై చీడపీడల దాడి అధికమై సస్యరక్షణ ఖర్చు పెరుగుతోంది. భూములు నిస్సారమై భవిష్యత్ లో పంటలు వేయడానికి పనికి రాకుండా పోయే ప్రమాదం ఉంది. రైతన్న ఆరుగాలం శ్రమ మట్టి పాలవుతోంది. నేలలో అంతర్లీనంగా ఉన్న పోషకాలను కాపాడుకోకుండా, భూసారం తెలుసుకోకుండా ఎలాంటి పంటలు సాగు చేసినా దిగుబడి లేక ఆర్థికంగా చతికిల పడాల్సిన దుస్థితి ఏర్పడుతుంది. ఈ నేపథ్యంలో రైతులకు భూసార పరీక్షలు చేసుకోవడం తప్పా మరో దారి లేని పరిస్థితి. మరో నాలుగు రోజుల్లో ఖరీఫ్ సీజన్ ప్రారంభం కానుంది. అయితే దీనికి నెల రోజుల ముందే వ్యవసాయ శాఖ అధికారులు భూసార పరీక్షలు చేయాల్సి ఉంది. వానాకాలం పంటలు విత్తుకునే సమయానికి ఫలితాలు వస్తే అందుకు అనుగుణంగా విత్తనం, ఎరువులు వినియోగించుకునే అవకాశం ఉంటుంది. కాగా శ్రీకాళహస్తి వ్యవసాయ శాఖ డివిజన్ పరిధిలో భూ సార పరీక్షలు, మట్టి నమూనాల సేకరణ ఇంకా సాగుతుండడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

శ్రీకాళహస్తి వ్యవసాయ శాఖ డివిజన్ పరిధిలోని ఏర్పేడు, శ్రీకాళహస్తి రూరల్ మండలం, తొట్టంబేడు, బుచ్చినాయుడు కండ్రిగ, కేవిబి పురం మండలాల్లో సుమారు 1.5 లక్షల ఎకరాల సాగు భూములున్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ఇందులో ఇసుక, ఎర్రమట్టి, బంక, చౌడు నేలలు అధికంగా ఉన్నాయి. ఈ డివిజన్ లో అన్ని రకాల పంటలకు అనుకూలమైన నేలలు ఉన్నా రైతులు అధికంగా వరి, వేరుశనగ, పుచ్చ, దోస, సజ్జ, రాగి, మొక్కజొన్నలనే ఎక్కువగా సాగు చేస్తున్నారు. అయితే నేల స్వభావం తెలియకుండా అధిక దిగుబడుల కోసం ఎరువులు, క్రిమిసంహారక మందులు రైతులు పిచికారీ చేస్తున్నారు. పంటకు ఏ మేరకు ఎరువులు అవసరమో రైతులకు అవగాహన ఉండాలి. భూమిలో ఏయో పోషకాలు ఎంత మోతాదులో ఉన్నాయో తెలుసుకోవాలంటే భూసార పరీక్షల ద్వారా మాత్రమే సాధ్యమవుతుంది. మట్టి పరీక్షలు నిర్వహిస్తే పోషక లోపాలను గుర్తించవచ్చు. తద్వారా మోతాదులో రసాయన ఎరువులు వాడితే అనవసర ఖర్చు తగ్గించుకోవచ్చు. భూసారాన్ని కాపాడుకుంటూ నాణ్యమైన దిగుబడులు పొందవచ్చు. సాధారణంగా రైతులు భాస్వరం, పొటాష్ ఎరువులను మోతాదు కంటే తక్కువగాను, నత్రజని ఎరువును మోతాదుకంటే రెండు, మూడు రెట్లు ఎక్కువగాను వేస్తుంటారు. దీనివల్ల పోషకాల సమతుల్యత దెబ్బతింటుంది. నత్రజని ఎరువును అధిక వినియోగం వల్ల పూత, పిందె ఆలస్యంగా రావడం, గింజలు ఎక్కువగా తాలిపోవడం వంటివి జరుగుతాయి. పై సమస్యలన్నింటినీ అధిగమించేందుకు వ్యవసాయ అధికారులు రైతులను భూసార పరీక్షలు చేయించుకోమని ప్రోత్సహిస్తున్నారు. ఇందులో భాగంగా ఐదు మండలాల పరిధిలో 5150 మంది రైతుల నుంచి మట్టి నమూనాలు సేకరించేలా లక్ష్యం నిర్దేశించారు. ఇప్పటివరకు 90 శాతం మాత్రమే సేకరించిన మట్టి నమూనాలు తిరుపతిలోని ల్యాబ్ కు వెళ్లాయి. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో భూసార పరీక్షలకు అంతరాయం ఏర్పడుతుంది. మరి సేకరించిన మట్టి నమూనాల ఫలితాలైనా వస్తాయా..! ఖరీఫ్ కంటే ముందే వస్తే ఉపయోగకరంగా ఉంటుందంటూ రైతులు అభిప్రాయపడుతున్నారు. భూసార పరీక్షల ఫలితాల కోసం నిరీక్షిస్తున్నారు.

త్వరలో ఫలితాలు అందుతాయి: రమేష్ బాబు, ఏడిఏ, శ్రీకాళహస్తి

శ్రీకాళహస్తి వ్యవసాయ శాఖ డివిజన్ పరిధిలో మొత్తం 5 వేల మంది రైతుల నుంచి మట్టి నమూనాలు సేకరించాలని ఆదేశాలు జారీ చేశాం. సేకరణ ప్రక్రియ దాదాపు పూర్తయి నమూనాలు తిరుపతి ల్యాబుకు చేరాయి. త్వరలోనే ఫలితాలు రైతులకు మెసేజ్లు, కార్డుల రూపంలో అందుతాయి.

మట్టి నమూనాను సేకరిస్తున్న సిబ్బంది

వామపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో..

విశాఖ ఉక్కును కాపాడుకుందాం

కలెక్టరేట్ వద్ద కార్మిక సంఘాల నిరసన

ప్రజాశక్తి - తిరుపతి (మంగళం)

విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వమే నిర్వహించాలని, స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్‌కు విశాఖపట్నం ఉక్కు ఫ్యాక్టరీని అప్పగిస్తే ఎంతో మేలు జరుగుతుందని కార్మిక సంఘాల నేతలు ఉద్ఘాటించారు. రాష్ట్ర పిలుపులో భాగంగా వామపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ ఎంతో ఘన చరిత్ర ప్రాణత్యాగాలతో విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను నిర్మించుకున్నామని, ఐదువేల కోట్ల పెట్టుబడితో అప్పట్లో ఏర్పాటు చేస్తే, నేడు రెండున్నర లక్షల కోట్ల విలువకు చేరుకుందని అన్నారు. ఎంతోమందికి ఉపాధి అవకాశాలను కల్పిస్తూ, నాణ్యమైన ఉక్కును అందిస్తున్న విశాఖ ఉక్కును ప్రైవేట్‌పరం చేస్తుంటే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. 33వేల మంది కార్మికులు పనిచేస్తుంటే, అందులో నాలుగువేల మంది కార్మికులకు ఉద్వాసన పలకడం అన్యాయమన్నారు. ఎంతోమందికి ఉపాధి కల్పిస్తున్న విశాఖ ఉక్కును దేశ ప్రజలు కాపాడుకోవాలని, ఫ్యాక్టరీకి సంబంధించి ప్రభుత్వం సొంత గనిని చూడాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు బాలసుబ్రమణ్యం, నాయకులు టి.సుబ్రమణ్యం, వేణుగోపాల్, జయచంద్ర, సాయిలక్ష్మి, బుజ్జి, సిపిఐ నాయకులు హరినాథ రెడ్డి, చిన్నం పెంచలయ్య, రాధాకృష్ణ పాల్గొన్నారు.



జీవనభృతి కల్పించాలంటూ ఐద్వా వినతి

సమస్యల 'పర్వం'... స్పందించాలి 'సత్వరం'..

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీల పర్వం

ప్రజాశక్తి - తిరుపతి (మంగళం)

ప్రతి సోమవారం కలెక్టరేట్ కిటకిటలాడాల్సిందే.. కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ ప్రతి వారం 'ప్రతి అర్జీకి నాణ్యతతో కూడిన పరిష్కారం చూపాలి' అని అధికార యంత్రాంగాన్ని ఆదేశిస్తూనే ఉంటారు.. ఎప్పటిలానే సోమవారం జేసీ శుభం బన్సల్, డిఆర్ఓ నరసింహులు, డిప్యూటీ కలెక్టర్లు దేవేంద్రరెడ్డి, శివశంకర్‌నాయక్, సుధారాణి, రోజ్‌మాండ్‌లతో కలిసి అర్జీలను స్వీకరించారు. అత్యధికంగా రెవిన్యూ శాఖకు సంబంధించి 150 అర్జీలు, పంచాయతీరాజ్ 20, సివిల్ సప్లై 15, పోలీసు విభాగానికి సంబంధించి 12 అర్జీలు పిజిఆర్ఎస్ కార్యక్రమానికి ప్రజల నుండి చేరాయని అధికారులు ప్రకటించారు. ప్రధనమైన సమస్యలనైనా అధికార యంత్రాంగం సత్వరం పరిష్కరించాలని బాధితులు కోరుతున్నారు.

– ఇటీవల తిరుపతి మంగళం అంబేద్కర్ కాలనీలో నివాసం ఉండే ఆటో కార్మికురాలు భాగ్యశ్రీని అధికార పార్టీ నాయకులు సూరి, ధనకుమార్, ప్రసన్న, మరికొంతమంది కలిసి దాడిచేశారని, ఆమె ప్రస్తుతం ఆస్పత్రిలో శస్త్ర చికిత్సలు చేయించుకున్నారని, కోలుకోడానికి కొన్ని నెలలు పడుతుందని, ఆమెకు జీవనోపాధి చూపించాలని ఐద్వా జిల్లా కార్యదర్శి డాక్టర్ సాయిలక్ష్మి వినతిపత్రం ఇచ్చారు. ఆమెకు తగిన పరీక్షలు నిర్వహించి, పెన్షన్ సదుపాయం కల్పించాలని కలెక్టర్ సూచించారని పేర్కొన్నారు.

– సమన్యాయం, సామాజిక న్యాయం దిశగా ఎస్టీ వర్గీకరణ జరిపి అన్ని విధాలా వెనుకబడిన యానాదులకు న్యాయం చేయాలని యానాది రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు పెంచలయ్య యానాది, జిల్లా అధ్యక్షులు చెంచు మల్లికార్జున యానాది వినతిపత్రం సమర్పించారు.

– మామిడికి గిట్టుబాటు ధర కల్పించాలని, తోతాపురి రకానికి సంబంధించి జ్యూస్ ఫ్యాక్టరీలు ఇప్పటివరకూ ప్రక్రియ ప్రారంభించకపోవడంతో సిండికేట్ అయ్యారన్న అనుమానం కలుగుతోందని మామిడి రైతులు చంద్రశేఖర్, నాగిరెడ్డి పేర్కొన్నారు. సకాలంలో చర్య తీసుకోకపోతే మామిడి రైతులకు ఆత్మహత్యే శరణ్యమని, ప్రభుత్వం వెంటనే రూ.15వేల రూపాయలు గిట్టుబాటు ధర కల్పించాలని వేడుకొన్నారు.

– ప్రభుత్వ, ప్రైవేటు నిర్మాణాలలో జాగ్రత్తలు పాటించాలని బిల్డింగ్ అండ్ అదర్ కన్స్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, నాయకులు చిన్న, పి.మునిరాజా, సుందరం ఆధ్వర్యంలో వినతి ఇచ్చారు. నిర్మాణాల్లో జాగ్రత్తలు పాటించకపోవడం వల్ల అనేకమంది ప్రాణాలు పోతున్నాయన్నారు. తుడా క్వార్టర్స్‌లో ఆరు అంతస్తుల భవనం నుంచి ముగ్గురు మరణించారని తెలిపారు.

– గూడూరు – గిద్దలూరు రోడ్డు మరమ్మతులు చేయాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పంటా శ్రీనివాసులురెడ్డి పేర్కొన్నారు. 2014లో కాంగ్రెస్ హయాంలో వేసిన రోడ్డుకు మరమ్మతులు చేయకపోవడం వల్ల దాదాపు 15 గ్రామాల ప్రజలు అవస్థలు పడుతున్నారన్నారు. వాహనం కొనేటపుడు ట్యాక్స్ కట్టించుకుంటున్న ప్రభుత్వం, ప్రజలకు రోడ్డు వసతి కల్పించకపోవడం దుర్మార్గమన్నారు. 4 కోట్ల 50 లక్షల రూపాయలతో రోడ్డు మరమ్మతు చేసినట్లు చూపుతున్నారని, ఈ నిధులు ఎవరి జేబులోకి వెళ్లాయని ప్రశ్నించారు.

– తిరుపతి పట్టణ సర్వే నంబర్ 4048లోని శ్రీ తాతయ్యగుంట గంగమ్మ ఆలయం 70 సెంట్లకు మినహా ఉన్న ఎ2.49 సెంట్లు స్థలంలో ఇళ్ల నిర్మాణం చేసుకున్న వారిని 22ఏ నుండి మినహాయింపు ఇవ్వడంపై జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ ను కలసి రాష్ట్ర యాదవ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ గొల్ల నరసింహ యాదవ్ ఆధ్వర్యంలో సత్కరించి కతజ్ఞతలు తెలిపారు.

– చంద్రగిరి నియోజకవర్గం రామచంద్రాపురం మండలంలో గుట్టను చదును చేసి ఎర్రమట్టి అమ్ముకుంటున్న దొంగలను, గుట్టను కబ్జా చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని సిపిఎం జిల్లా నాయకులు జయచంద్ర ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. పంచాయితీ ఆఫీసుకు కూతవేటు దూరంలో ఉండే చంద్రగిరి ప్రభుత్వ బాయ్స్ హాస్టల్ దగ్గరలోని 1479 సర్వే నెంబర్‌లో మట్టిని తవ్వి వందల ట్రిప్పులు స్వాహా చేస్తున్నా పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. రామాపురం నుంచి పచ్చికాపలం రోడ్డు వరకూ కొండలన్నీ మాయమయ్యాయన్నారు. ఒక్కో ఎర్రమట్టి ట్రిప్పు రూ.30వేలకు అమ్మి సొమ్ము చేసుకుంటున్నారన్నారు. కొండలను చదును చేసి మామిడి, కొబ్బరి మొక్కలు నాటుతున్నారన్నారు.

కుక్కల బెడదతో ఇబ్బంది

తిరుపతి టౌన్ : నగర పాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన డయల్ యువర్ కమిషనర్, ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 37 వినతులు వచ్చాయి. తమ వార్డుల్లో సమస్యలు పరిష్కరించాలని డిప్యూటీ మేయర్లు ముద్ర నారాయణ, ఆర్.సి.మునికృష్ణ, కార్పొరేటర్లు శైలజ, నరసింహ ఆచారి, నరేంద్రలు కమిషనర్ ను కోరారు. కమిషనర్ మాట్లాడుతూ రైల్వేస్టేషన్, తదితర ప్రాంతాల్లో కుక్కల బెడద ఎక్కువగా ఉందని, రాఘవేంద్రనగర్‌లో వీధిదీపాలు ఏర్పాటు చేయాలని, మధురానగర్‌లో కొద్దిపాటి వర్షానికే నీరు చేరుతోందని ఫిర్యాదులు అందాయి. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్ ఉన్నారు.

కుక్కంబాకం దళితులకు పట్టాలివ్వాలి : సిపిఎం

బుచ్చినాయుడు కండ్రిగ : మండలంలోని కుక్కంబాకం దళితుల సాగులో ఉన్న భూములకు పట్టాలివ్వాలని తహశీల్దార్ కార్యాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దాసరి జనార్ధన్ మాట్లాడుతూ సర్వే నంబర్ 81లో 82 ఎకరాల 80 సెంట్లు ప్రభుత్వ భూమి ఉండగా, అందులో దళితులు గత 10ఏళ్లుగా సాగు చేసుకుంటున్నారన్నారు. ప్రాంతీయ కార్యదర్శి గంధం మణి మాట్లాడుతూ దళితుల సాగులో ఉన్న భూమిపై స్థానికేతరులైన పెత్తందారులు ఆ భూమి తమదంటూ దౌర్జన్యం చేస్తున్నారని, కేసులు పెడితే దళితులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. రెవెన్యూ అధికారులు జోక్యం చేసుకుని దళితులకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గ్రామస్తులతో కలిసి తహశీల్దార్ శ్రీదేవికి వినతిపత్రం సమర్పించారు. నాయకులు రమణయ్య, తిరుపాలు, సుబ్బయ్య, జెకె రమణయ్య, కృష్ణమ్మ, చెంగమ్మ పాల్గొన్నారు.

దొరవారిసత్రం తహశీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించిన కళాకారులు

పట్టాలకు ఇళ్లస్థలాలు చూపాలని...

జానపదవృత్తి కళాకారుల ముట్టడి

తహశీల్దార్ హామీతో విరమణ

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

తమకు కేటాయించిన పట్టాలకు స్థలాలు చూపాలని గత మూడు నెలలుగా కాళ్లు అరిగేలా దొరవారి సత్రం తహశీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోకపోవడంతో సోమవారం జానపద వృత్తి కళాకారులు పెద్దఎత్తున ముట్టడించారు. అనంతరం దొరవారి సత్రం మండలం తహశిల్దార్‌తో చర్చలు జరిపారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు మాట్లాడుతూ నెల రోజుల లోపు కళాకారులకు ఇచ్చిన ఇళ్ల పట్టాలకు స్థలాలు చూపుతామని, పట్టాలు ఇచ్చిన స్థలంలో 145 సెక్షను అమలు చేస్తూ ప్రకటించి నాలుగు వారాల లోపు ఈ సమస్యను పరిష్కరిస్తామని తహశీల్దార్ హామీ ఇచ్చినట్లు తెలిపారు. అయితే కళాకారులకు ఇచ్చిన పట్టాల స్థలంలో కొంతమంది కబ్జాలకు పాల్పడుతూ, లబ్ధిదారుల స్థలాలను అన్యాక్రాంతం చేస్తుడడంపై వందవాసి నాగరాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పేద కళాకారుల పట్ల రెవెన్యూ అధికారులు సహృదయంతో పట్టాలు పొందిన వారందరికీ స్థలాలు చూపాలన్నారు. జానపద వృత్తి కళాకారుల సంఘం పోరాటానికి డప్పు కళాకారులు, ఆటో కార్మికులు సంఘీభావంగా నిలిచారు. ఈ ముట్టడి కార్యక్రమంలో సిపిఎం పార్టీ ప్రాంతీయ నాయకులు సి.చంద్రశేఖర్, నాయకులు లక్ష్మయ్య, ఎస్ రియాజ్, జానపద కళాకారుల సంఘం కార్యదర్శి పి.నాగరాజు, కళాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

బిఎన్ కండ్రిగ కార్యాలయం ఎదుట...

జీవితమంతా 'శ్రీవారి' చెంతనే..!

ప్రజాశక్తి-తిరుపతి సిటీ

'నాలుగు దశాబ్దాల పాటు శ్రీవారి సేవ సంతృప్తినిచ్చింది' అని టిటిడి ఆఫీసు సబార్డినేటర్ కుప్పిరెడ్డి రామకృష్ణారెడ్డి తెలిపారు. ఈనెల 31న ఉద్యోగ విరమణ చేయనున్న ఆయన 'ప్రజాశక్తి'తో ఆయన జీవిత విశేషాలు, స్వామి సన్నిధిలో ఆయన చేసిన సేవలను వివరించారు. మా సొంతూరు తిరుపతి. రోసమ్మ, గోవిందరెడ్డి దంపతులకు 1963లో తొలి సంతానంగా జన్మించాను. మా తండ్రి గోవిందరెడ్డి ముగ్గురు పిల్లలను క్రమశిక్షణతో, మానవీయ విలువలతో, సేవా దృక్పదాన్ని పెంపొందించి పెంచారు. తిరుపతిలోనే పుట్టాను. పెరిగాను. టిటిడి విద్యాసంస్థల్లోనే చదువుకున్నారు. బిఎ చదివాను. నా సతీమణి మాధవి. నా విధి నిర్వహణలో ఎటువంటి టెన్షన్ లేకుండా నా వెన్నంటే నిలిచారు. కుమార్తె పూజిత పిహెచ్‌డి చేస్తున్నారు. కుమారుడు సాయి దిలీప్ చార్టర్డ్ అకౌంటెంట్ పూర్తి చేశారు. నా విధి నిర్వహణలో నా సహ ఉద్యోగుల సహకారం మరువలేనిది. 1985లో టిటిడి గార్డెన్ విభాగంలో గార్డ్‌గా ఉద్యోగం వచ్చింది. తొలి పోస్టింగ్ తిరుమలలోనే. 2001 వరకూ గార్డెన్‌గా విధులు నిర్వహించాను. 2009లో కపిలేశ్వర స్వామి ఆలయంలో పలు రకాల విభాగాల్లో విధులు నిర్వహించాను. తిరుపతిలో మార్కింగ్ సెక్షన్ విభాగంలో విధులు నిర్వహిస్తూ ఉద్యోగ విరమణ చేస్తున్నాను. గార్డుగా విధుల్లో చేరి, ఆఫీసు సబార్డినెంట్‌గా విరమణ చేస్తున్నాను.

కే.రామకృష్ణారెడ్డి, ఆఫీసు సబార్డినేటర్, టిటిడి



టిటిడి ఉద్యోగోన్నతుల్లో రిజర్వేషన్‌కు సానుకూలం

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

తిరుమల తిరుపతి దేవస్థానంలో ఉద్యోగోన్నతుల్లో రిజర్వేషన్ పాటించాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందాయి. ఎస్సీ, ఎస్టీ ఉద్యోగోన్నతుల్లో కాన్సిక్వెన్షియల్ సీనియారిటీ ప్రకారం ఉద్యోగోన్నతులు ఇవ్వాలని న్యాయపోరాటం చేయగా సానుకూలంగా స్పందన లభించింది. 2017 నుంచి న్యాయపోరాటం చేసినట్లు టిటిడి ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు డాక్టర్ మేడికొండ ప్రసాదరావు, జాటోత్ భాస్కర్, బివి శ్యాంసుందర్, తలారి మహేష్, దేవేంద్రబాబు, లక్ష్మణ్‌నాయక్ పేర్కొన్నారు. నిర్ణయం తీసుకోవడంలో ప్రభుత్వ జాప్యం వల్ల అన్ని అర్హతలు ఉన్నప్పటికీ అనేకమంది ఉద్యోగోన్నతి లేకుండానే విరమణ చేశారని పేర్కొన్నారు.

ఈ 'ఆర్‌ఐ'లు 'రాజకీయ ఒత్తిళ్లకు' దూరమేనా..?

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

బూర్జువా రాజకీయాల్లో 'రాజకీయ ఒత్తిళ్లు' సర్వసాధారణమైపోయాయి. గత వైసిపి హయాంలో మున్సిపల్ కార్పొరేషన్‌లో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ల నియామకం బరితెగించి అక్రమంగా చేశారన్న ఆరోపణలను ఆ ప్రభుత్వం మూటగట్టుకుంది. నగరంలో ఏ కట్టడం నిర్మించినా వాటికి పన్నులు విధించడం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ల విధివిధానం. అయితే కొంతమంది రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు వైసిపి నేతల కనుసన్నల్లో పనిచేస్తూ ఆ పోస్టులను అవినీతిమయం చేశారు. కూటమి అధికారంలోకి రావడంతో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లను మార్చాలనే ప్రతిపాదన వచ్చింది. కార్పొరేషన్ పాలనను గాడిన పెట్టేలా కమిషనర్ మౌర్య సమర్థులైన ఆర్‌ఐలను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారని చర్చ నడుస్తోంది. రెవెన్యూ అధికారి సేతుమాధవ్ పరిధికి సంబంధించి మేయర్ పీఏగా ఉన్న హరిమోహన్, హెల్త్ సెక్షన్లో పనిచేసే ఎస్ఎండీ రఫీ, సీనియర్ అసిస్టెంట్లు కె.నరేష్, ఎం. కష్ణమూర్తి, టైపిస్ట్ నవీన్లు ఆర్‌ఐలుగా నియమితులయ్యారు. మరో ఆర్వో రవి పరిధిలో టైపిస్ట్ పి. మునిరత్నం రెడ్డి, జూనియర్ అసిస్టెంట్లు ఆర్. కరుణాకర్, పి.మోహన్, ఎస్.పావనిలను బదిలీ చేశారు. ఇది ఇలా ఉండగా పాత రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు తమను ఆర్‌ఐలుగా కొనసాగించాలని ప్రజాప్రతినిధులను వేడుకొన్నా, రాజకీయ ఒత్తిళ్లకు లొంగకుండా కమిషనర్ మౌర్య ఈ నియామకం చేశారని చర్చ నడుస్తోంది. నగరంలోని అక్రమ కట్టడాలు, పన్నుల వసూళ్లలో తాజా ఆర్‌ఐలు ఏ విధంగా స్పందిస్తారో వేచి చూడాల్సిందే.

నీళ్లల్లో జాయ్..ఆకాశంలో హాయ్..!

• కల్యాణి డ్యాంలో 'సీ ప్లేన్' • రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

జిల్లాల విలీన ప్రక్రియలో భాగంగా నెల్లూరు జిల్లా నుంచి తిరుపతి జిల్లాకు సముద్రం వచ్చింది.. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ పర్యటక శాఖ అభివృద్ధిలో భాగంగా చంద్రగిరి నియోజకవర్గం కల్యాణిడ్యాంలో సీ ప్లేన్' రానుంది. త్వరలోనే జిల్లా ప్రజానీకం 'నీళ్లలో హెలికాప్టర్' ప్రయాణం చేసి ఆనందాన్ని పంచుకోనున్నారు. ఈ మేరకు సిఎం చంద్రబాబునాయుడు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. త్వరలోనే మొదటి దశలో అమరావతి, తిరుపతి, గండికోట నుంచి సేవలు మొదలుకానున్నాయి. ఈ సీ ప్లేన్ ప్రయాణంలో పర్యాటక రంగానికి ఊతమిచ్చినట్లవుతుంది. తక్కువ ఖర్చుతో మారుమూల ప్రాంతాలకు విమాన సౌకర్యం కలగనుంది. ఉద్యోగ ఉపాధి అవకాశాలు సైతం మెరుగుపడే ఛాన్స్ ఉంది.

రాష్ట్రంలో 11 చోట్ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. సాధారణంగా విమానాలు గాలిలో ఎగురుతాయి. అయితే ఈ సీ ప్లేన్ జలాశయంలో నీటిపై తేలియాడుతూ, ఆపై నింగిలోకి ఎగిరి విహరించేలా ప్లాన్ చేస్తున్నారు. కేంద్ర పౌర విమానయాన సంస్థ దేశవ్యాప్తంగా 56 మార్గాల్లో సీప్లేన్ అందించేందుకు టెండర్లు పిలిచింది. 11 ప్రాంతాలను గుర్తించింది. వాటిలో ఎనిమిది ప్రాంతాల నుంచి సేవలు నడిపేందుకు టెక్నో ఫీజుబిలిటీ నివేదిక, డిపిఆర్ తయారీకి టెండర్లు పిలిచారు.రాష్ట్రంలో మొదటి దశలో మూడు చోట్ల సేవలను ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

కల్యాణిడ్యాంలో ట్రయల్ రన్ సక్సెస్

తొలి విడతకు సంబంధించి ప్రకాశం బ్యారేజీ, తిరుపతిలోని కళ్యాణి డాం, గండికోట నుంచి సేవలు ప్రారంభించనున్నారు. అమరావతితో పాటు గండికోట డిపిఆర్ బాధ్యతలను రైట్స్ సంస్థకు అప్పగించారు. తిరుపతి డిపిఆర్ బాధ్యతలను ఫీడ్బ్యాక్ హైవే సంస్థకు అప్పగించారు. ఆసక్తి ఉన్న సంస్థలతో అధికారులు చర్చలు జరుపుతున్నారు. అయితే మొత్తం 32 మార్గాలలో ఈ సీప్లేన్ రాకపోకలు సాగించేలా ప్రణాళిక రూపొందించారు. మొదటి దశలో చేపట్టే మూడు మార్గాలకు దగ్గర్లో ఎయిర్పోర్టు ఉండడం విశేషం. సిప్లేన్ సేవలు సాధారణ విమాన సర్వీసులతో కలిపి అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తోంది. విమాన ఖర్చుల కంటే తక్కువగా టిక్కెట్లు అందుబాటులోకి తేవాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. అయితే ఇప్పటికే ఏపీలో సీ ప్లేన్ సేవలు అందుబాటులోకి వచ్చాయి. గత ఏడాది నవంబర్ 9న విజయవాడలోని పున్నమి ఘాట్ నుంచి శ్రీశైలం వరకు సిప్లేన్ ను ప్రభుత్వం ప్రయోగాత్మకంగా పరిశీలించిన సంగతి తెలిసిందే. ట్రయల్ రన్ లో సీఎం చంద్రబాబు, కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు ప్రయాణం చేశారు. అది విజయవంతం కావడంతోనే కొత్తగా మూడు మార్గాల్లో సీ ప్లేన్ సేవలు ప్రారంభించేందుకు నిర్ణయించారు.

సిఎంకు సాదర వీడ్కోలు

ప్రజాశక్తి - శాంతిపురం

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మూడు రోజుల కుప్పం పర్యటన ముగించుకుని సోమవారం ఉదయం 10.50 గంటలకు సొంతింటి నుంచి తిరుగు ప్రయాణం అయ్యారు.ఆదివారం శాంతిపురం మండలం కడపల్లి శివపురం వద్ద నూతనంగా నిర్మించిన సొంతింటి గృహప్రవేశ కార్యక్రమాన్ని విజయవంతంగా ముగించుకున్నారు. హెలిపాడ్ వద్ద సిఎంను కలిసేందుకు వచ్చిన ప్రజానీకానికి అభివాదం చేశారు. ప్రజల నుంచి అందుకున్న వినతులను స్వీకరించిన ముఖ్యమంత్రి వెంటనే వీటిని పరిశీలించి పరిష్కరించాలని చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను ఆదేశించారు. అనంతరం గుడిపల్లి మండలం ద్రావిడ యూనివర్సిటీ ఇందిరాగాంధీ స్టేడియంలో ఏర్పాటు చేసిన హెలిపాడ్ నుంచి బెంగుళూరు ఎయిర్‌పోర్టుకు ఉదయం 11.20 గంటలకు బయల్దేరి వెళ్లారు. సిఎం కార్యదర్శి ప్రద్యుమ్న, ప్రభుత్వ విప్, ఎంఎల్‌సి డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, అనంతపురం రేంజి డిఐజి షిమోషి, కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్‌పి మణికంఠ చందోలు, జేసీ జి.విద్యాధరి, కడ పీడీ వికాస్ మర్మత్, రాష్ట్ర ఎపిఎస్ఆర్‌టిసి వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, కుప్పం ఆర్డీవో శ్రీనివాసరాజు సాదర వీడ్కోలు పలికారు.

అర్జీలను స్వీకరిస్తున్న సిఎం చంద్రబాబు

చిన్నపిల్లలు ఆధారు నమోదు చేసుకోవాలి: ఎంపిడివో

ఆధార్ కార్డుకు పేర్లు నమోదు చేసుకుంటున్న చిన్నారుల తల్లిదండ్రులు

ప్రజాశక్తి- బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలో చిన్నపిల్లలు ఆధార్ నమోదు చేసుకోవాలని ఎంపిడివో వెంకట రత్నమ్మ పేర్కొన్నారు. సోమవారం ఉదయం ఎంపీడీవో కార్యాలయంలో ఆధార్ నమోదు కార్యక్రమాన్ని ఎంపిడివో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో 28 పంచాయతీలకు చెందిన ఎక్కువ శాతం గిరిజనులు ఇంతవరకు చిన్న పిల్లలకు ఆధార్ నమోదు చేయకపోవడంపై ఆమె ప్రత్యేక శ్రద్ధ వహించి ఆధార్ క్యాంపు నిర్వహించారు. సోమవారం నమోదు చేసుకున్న వారిని గుర్తించి 28 పంచాయతీలలో పంచాయతీకి ఒకరోజు చొప్పున ఆధార్ క్యాంపు కార్యక్రమం నిర్వహిస్తామని ఎంపిడివో పేర్కొన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సుబ్రహ్మణ్యం, పంచాయతీ సిబ్బంది, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

టిడిపి మండల అధ్యక్షునికి సన్మానం

ముని చంద్రారెడ్డిని సన్మానిస్తున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి- రేణిగుంట: టిడిపి మండలాధ్యక్షుడు ముని చంద్రారెడ్డికి సోమవారం ఘన సన్మానం నిర్వహించారు. ఆర్ మల్లవరం జిల్లా ప్రజా పరిషత్ పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ ధర్మారెడ్డి బొబ్బిలి రెడ్డి గాజులమండ్యంలోని ముని చంద్రారెడ్డి నివాసానికి చేరుకొని మర్యాద పూర్వకంగా కలిశారు. రెండవసారి టిడిపి మండల అధ్యక్షుడుగా బాధ్యతలు చేపట్టిన ముని చంద్రారెడ్డిని శాలువాతో సన్మానించి పూలమాలతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బొబ్బిలి రెడ్డి మాట్లాడుతూ మంచి మనసున్న నాయకుడు ముని చంద్రారెడ్డికి మండల అధ్యక్ష పదవి లభించడం ఆనందంగా ఉందన్నారు. అందర్నీ కలుపుకుపోయి క్రమశిక్షణకు మారుపేరైన ముని చంద్రారెడ్డికి మండల అధ్యక్షుడు పదవి అందజేసిన శ్రీకాళహస్తి నియోజకవర్గం ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు రమేష్ పాల్గొన్నారు.

ఆర్‌టిసి డిస్పెన్సరీ పరిశీలన

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: తిరుపతిలో నూతనంగా నిర్మిస్తున్న ఆర్‌టిసి డిస్పెన్సరీని ఏపీఎస్ ఆర్‌టిసి మేనేజింగ్ డైరెక్టర్ ద్వారకా తిరుమల రావు సోమవారం పరిశీలించారు. జిల్లా పర్యటనలో భాగంగా ఆర్టీసీ ఎండీ సత్యవేడు డిపోను తనిఖీ చేశారు. అనంతరం తిరుపతి చేరుకున్న ఆయన అలిపిరి అతిథి గృహం సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న ఆర్టీసీ డిస్పెన్సరీ నిర్మాణ పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ఈడీ చెంగల్ రెడ్డి, తిరుపతి ప్రజా రవాణా అధికారి, డిప్యూటీ సిటిఎం, పలు డిపో మేనేజర్లు, ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.

స్పార్టన్ జట్టుపై పాయ్ వైస్రాయ్ జట్టు విజయం

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: చిత్తూరు ప్రీమియర్ లీగ్ (సీపీఎల్-1)లో స్పార్టన్ జట్టుపై పాయ్ వైస్రాయ్ జట్టు ఘన విజయం సాధించింది. మొదట బ్యాటింగ్ చేసిన పాయ్ వైస్రాయ్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 175/9 పరుగులు చేయగా బ్యాటింగ్ లో ధరణి కుమార్ 69(46) సూర్య 26(13) పరుగులతో రాణించారు. బౌలింగ్ లో ప్రవీణ్ రోహిత్ 3,ప్రవీణ్ వాట్సన్ అండ్ రెండు వికెట్లు తీసుకున్నారు.176 పరుగుల విజయ లక్ష్యంతో బరిలోకి దిగిన స్పార్టన్ జట్టు 19 ఓవర్లలో 139 పరుగులు చేసి ఆలౌట్ అయింది. బ్యాటింగ్‌లో మోనిష్ మాత్రమే 62(46) పరుగులు చేశారు.బౌలింగ్ లో గిరీష్ రెడ్డి విజృంభించి 4 ఓవర్లలో కేవలం 20 పరుగులు మాత్రమే ఇచ్చి 4 వికెట్లు తీయగా,నవాజ్ రెండు వికెట్లతో రాణించారు. దీంతో పాయ్ వైస్రాయ్ జట్టు 36 పరుగుల తేడాతో విజయం సాధించింది. బ్యాటింగ్ లో 16 పరుగులు, బౌలింగ్ లో 4 వికెట్లు తీసిన గిరీష్ రెడ్డి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు కైవసం చేసుకున్నారు. గిరీష్ రెడ్డికి డాక్టర్ జయప్రసాద్,ఈసీ మెంబర్ శివప్రసాద్, మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందించారు. మధ్యాహ్నం రాయల్ చాలెంజ్ వర్సెస్ హైపెరియన్ మధ్య జరిగిన ఉత్కంఠ పోరులో హైపెరియన్ జట్టు విజయం సాధించింది. పృధ్విరాజ్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కించుకున్నారు. మెడిగో డైరెక్టర్ డాక్టర్ ప్రవీణ్,రంజి ప్లేయర్ ఎలైజర్,కోచ్ అనిత పృధ్విరాజ్ కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అందించారు.

మహానాడు సభా స్థలం పరిశీలన

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: కడపలో జరగనున్న మహానాడు సభా స్థలాన్ని సోమవారం ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి పరిశీలించారు. మహానాడు ఏర్పాట్లు అద్భుతంగా ఉన్నాయని కొనియాడారు. మూడు రోజుల పాటు సాగే మహానాడు వేదికగా టీడీపీ కార్యకర్తలు జగన్ గడ్డపై గర్జించనున్నారని సుధీర్ రెడ్డి అన్నారు.

టీటీడీ ట్రస్టులకు రూ.11 లక్షలు విరాళం

ప్రజాశక్తి - తిరుమల: తిరుమల క్యాంప్ కార్యాల యంలో చైర్మన్ బీఆర్ నాయుడును కలిసి అమెరికా టెక్సాస్‌కు చెందిన వేదాల రంగనాధ్, కృష్ణ కుమారి దంపతులు రూ.11 లక్షల విలువైన విరాళాన్ని అందించారు. ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు రూ.10 లక్షలు, ఎస్వీ గోసంరక్షణ ట్రస్టుకు లక్ష విరాళాన్ని దాతలు అందజేశారు. దాతలను చైర్మన్ అభినందించారు.

ఒకే రోజు 5,88,107 ఎల్ఐసి పాలసీలు

ప్రజాశక్తి - నాయుడుపేట రూరల్ : 24 గంటల వ్యవధిలో4,52,839 మంది ఏజెంట్ల నుండి 5,88,107 అత్యధిక పాలసీలు సేల్ చేసి ఎల్ఐసి గిన్నిస్ వరల్డ్ రికార్డ్‌లోకి ఎక్కిందనీ సంబంధిత అధికారులు అధికారికంగా ప్రకటించారు. బీమా రంగంలో అంతర్జాతీయంగా కొంత బెంచ్ మార్క్‌ను క్రియేట్ చేసినట్లు పేర్కొన్నారు. పని పట్ల ఏజెంట్లు కున్న అంకిత భావమే వారి స్కిల్స్ కు నిదర్శనమని చెప్పారు. ఈ వేడుకను నాయుడుపేట ఎల్ఐసి సీనియర్ మేనేజర్ సురేష్ బాబు ఆధ్వర్యంలో నిర్వహించారు.

ఈవిఎం గోడౌన్లు తనిఖీ

ప్రజాశక్తి - రేణిగుంట: ఈవీఎంల తనిఖీ లో భాగంగా రేణిగుంట వద్ద గల ఈవీమ్స్, వివిప్యాట్ లను భద్రపరిచే గోడౌన్‌లను డిప్యూటీ సీఈవో విశ్వేశ్వరరావుతో కలిసి జిల్లా కలెక్టర్ డా ఎస్.వెంకటేశ్వర్ తనిఖీ చేసారు. సోమవారం. షట్టర్లకు వేసిన సీళ్లను, సిసి కెమెరాలను పరిశీలించి భద్రత సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జి నరసింహులు, జి ఎన్ ఎస్ ఎస్ డిప్యూటీ కలెక్టర్, నోడల్ అధికారి సుధారాణి, శ్రీ కాళహస్తి ఆర్ డి ఓ, బానుప్రకాష్ రెడ్డి, ఎన్నికల సూపరింటెండెంట్ ప్రసాద్, రేణిగుంట తాసిల్దార్ సురేష్ పాల్గొన్నారు.

శాంతి దుర్లభం!

- వ్యాపార ప్రకటనల ప్రచార ధ్వని
- నిబంధనలు పాటించని ప్రకటనలదారులు
- పట్టణ ప్రజల చెవులకు చిల్లులు
- పట్టించుకోని అధికారులు

గతంలో వ్యాపార ప్రకటనల ప్రచారాలకు పట్టణంలో పోలీసులు అనుమతి తప్పనిసరి వుండేది. నేడు పుత్తూరు పట్టణంలో ఎలాంటి అనుమతి అవసరం లేకుండా శబ్ద ప్రచారం సాగిస్తున్నారు. దీంతో పట్టణ ప్రజలకు శాంతి దుర్లభంగా మారింది. నిరంతరం శబ్దం చెవులను చిల్లులు పడేలా చేస్తున్నాయని పట్టణ ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: పుత్తూరు మున్సిపాల్టీ పరిధిలోని పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో తమ తమ వ్యాపార ప్రకటనను విస్తృత ప్రచారం కోసం పండ్లు విక్రయించే వారి దగ్గర నుండి, శుభ్రత, పరిశుభ్రత, పాత సామాన్లు కొని తీసుకునే వారు అవగాహన కల్పించాలన్న ఉద్దేశంతో పట్టణంలో సౌండ్ సిస్టంల ద్వారా చేస్తున్న ప్రచారం, ప్రజలకు శాంతిని దూరం చేస్తోంది. ప్రజల ఇళ్ల ఎదుట, వీధుల్లో అధిక శబ్దంతో వినిపించే ప్రకటనలు ఇప్పుడు ప్రతి రోజూ తలనొప్పిని తెచ్చిపెడుతున్నాయి.

జోరుగా వ్యాపార ప్రకటనల ప్రచారం

ఉదయం ఆరు గంటలకే ప్రారంభమయ్యే ఈ శబ్ద యంత్రాలు, పిల్లల నిద్రను భంగం చేస్తున్నాయి. వృద్ధులు, అనారోగ్యంతో ఉన్నవాళ్లు ఈ శబ్ద కాలుష్యానికి తీవ్రంగా ప్రభావితమవుతున్నారు. విద్యార్థులు చదువులపై దృష్టి కేంద్రీకరించలేకపోతున్నారు. హాస్పిటల్, స్కూల్, రెసిడెన్షియల్ ఏరియాల్లోనూ లౌడ్‌స్పీకర్ల వినియోగం కొనసాగు తుండటంతో ప్రజల్లో అసహనం పెరుగుతోంది.

పట్టణ ప్రజల చెవులకు చిల్లులు

శుభ్రతపై అవగాహన పెంపొందించాల్సిన బాధ్యతను శబ్ద హోరులు సాగిస్తూ చెవులకు చిల్లులు పడేలా చేస్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 'క్లీనింగ్ అవసరమే కానీ, ఈ విధంగా శబ్దంతో కాదు..' అని పలువురు అభిప్రాయపడుతున్నారు. కొన్ని చోట్ల చిన్న చిన్న గొడవలకూ దారితీసిన ఘటనలు కూడా నమోదయ్యాయి. పాలకులు శాంతి భద్రతల్ని కాపాడాల్సిందిపోయి, తమ ప్రచార పద్ధతులతో ప్రజల మానసిక ప్రశాంతతకు భంగం కలిగిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

నిబంధనలు పాటించని ప్రకటనల దారులు

వ్యాపార ప్రచారం చేస్తున్న పండ్ల వ్యాపారి

నిబంధనలకు విరుద్ధంగా సౌండ్ సిస్టంల వినియోగంపై ఎలాంటి చర్యలూ తీసుకోకపోవడంపై ప్రజల్లో అసహనం నెలకొంటోంది. పర్యావరణ పరిరక్షణ నియమాల ప్రకారం శబ్ద పరిమితి మించకుండా ఉండాలి. కానీ అవి పట్టించుకోని పరిస్థితి ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది. ప్రజల ఆరోగ్యం, మనశ్శాంతికి అడ్డంకిగా మారిన ఈ శబ్ద ప్రచారంపై వెంటనే చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు డిమాండు చేస్తున్నారు.

చెడు వ్యసనాలకు బానిస కావద్దు

యువతకు పోలీసుల కౌన్సెలింగ్

యువతకు కన్సెలింగ్ ఇస్తున్న పోలీసులు

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: చెడు వ్యసనాలకు, చెడు మార్గాలకు బానిసలు కావద్దని జిల్లా సైబర్ క్రైం పోలీసులు యువతకు సూచించారు. నగరంలోని శ్రీనివాస మంగాపురం, గరుడ వారధి, 100 ఫీట్ రోడ్డు, చంద్రగిరి హైవే పై పది మంది సభ్యులతో కలిసి బైక్ రేసులు, బైక్‌తో స్టంట్స్, బైక్‌తో ఆర్ట్స్ చేస్తున్నట్లు పోలీసు విచారణలో తేలింది. అర్ధరాత్రి సమయంలో నగరంలోని విశాల రోడ్డుపై, ఫ్లైఓవర్‌పై, జాతీయ రహదారిపై, బైక్ రేసులు నిర్వహిస్తూ.. సోషల్ మీడియాలో పోస్టులు పెట్టి యువకులను ఆకర్షిస్తున్న అకౌంట్స్‌ను గుర్తించి, ఐదుగురు యువకులను ట్రాఫిక్ పోలీసు సిబ్బంది అదుపులోకి తీసుకున్నారు. యువకులతో పాటు వారి తల్లిదండ్రులను తిరుపతి ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌కు పిలిపించి సోమవారం కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ 'మీ పిల్లలపై కుటుంబ సభ్యులు కూడా సమయం దాటిన తరువాత ఇంటికి రాకుండా ఏం చేస్తున్నారో నిఘా పెట్టాలన్నారు. అర్ధరాత్రి దాటిన తరువాత మీ పిల్లలు ఇంటికి వస్తే... మీరు గట్టిగా పశ్నిస్తే.. మీ బిడ్డ మరోసారి తప్పు చేయడు.. చెడు మార్గంలో నడవడు..' అనే విషయాన్ని కుటుంబ సభ్యులు గుర్తించాలన్నారు. ఐదుగురు యువకులకు బైక్ రేసులకు సంబంధించిన సోషల్ మీడియా అకౌంట్స్ ను వారితోనే శాశ్వతంగా డిలీట్ చేయించారు. బైక్ రేసులు నిర్వహిస్తున్న యువకులపై కేసులు నమోదు చేస్తే.. వారి భవిష్యత్ అంధకారం అవుతుందని మొదటి తప్పుగా వారికి కౌన్సెలింగ్ ఇచ్చి ఇంటికి పంపారు. బైక్ రేసులు నిర్వహించి సోషల్ మీడియాలో పెడుతున్న వారి అకౌంట్స్‌ను తిరుపతి జిల్లా సైబర్ క్రైం పోలీసులు ఎప్పటికప్పుడు వాచ్ చేస్తుంటారని మరిచి పోవద్దని పోలీసులు యువతను హెచ్చరించారు. అర్ధరాత్రి బైక్ రేసులు నిర్వహించడం వల్ల మీతో పాటు మీ తోటి వారికి ఇబ్బందులు ఎదురవుతాయని గుర్తుంచుకోవాలన్నారు. ఏదైనా ఊహించని ఘటనలు జరిగితే.. మీ కుటుంబంతో పాటు మీకు, మరో కుటుంబాన్ని మీరు రోడ్డు మీద పడేసిన వారవుతారని తెలుసుకోవాలన్నారు. బైక్ రేసులు నిర్వహించేవారు పోలీసులకు సహకరించి మీ భవిష్యత్‌కు బంగారు బాటలు వేసుకోవాలని సూచించారు. అలా కాదని మరోసారి రోడ్డుపై బైక్ రేసులు నిర్వహించినా, దాన్ని మళ్లీ సోషల్ మీడియాలో పోస్టు చేసినా అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

నాయకత్వ లక్షణాలు పెంపొందించడానికే శిక్షణ

ఎన్‌సీసీ శిక్షణలో క్యాంపు కమాండెంట్

శిక్షణలో పాల్గొన్న ఎన్‌సిసిలు

ప్రజాశక్తి - రామచంద్రపురం: విద్యార్థులు విద్యతో పాటు దేశ రక్షణ కోసం ఎన్ సిసిలో చేరి, శిక్షణా తరగతులలో పాల్గొని ఐకమత్యం, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని క్యాంప్ కమాండెంట్ కెప్టెన్ రాజగోపాల్ జగదీష్ ఆత్రే కోరారు. సోమవారం సి రామాపురంలోని వెరిటాస్ సైనిక పాఠశాల ఆవరణలో వార్షిక శిక్షణ శిబిరాలను 11 ఎయిర్ స్క్వాడ్రన్ (టెక్నికల్) ఎన్‌సీసీ, తిరుపతి గ్రూప్ ప్రధాన కార్యాలయాల ఆధ్వర్యంలో ఉత్సాహంగా ప్రారంభించారు. ఈ శిబిరంలో తిరుపతి, మదనపల్లె ,బద్వేల్, చిత్తూరు జిల్లాలకు చెందిన 20 విద్యా సంస్థల నుండి 509 మంది ఎన్‌సీసీ క్యాడెట్లు హాజరయ్యారని క్యాంపు పరిశీలకులు గుణశేఖర్ తెలిపారు. సీనియర్ అసోసియేట్ ఎన్‌సీసీ అధికారి కేర్ టేకింగ్ ఆఫీసర్ రాజశేఖర్ ప్రధాన సమన్వయకర్తగా పని చేస్తున్నారు. ఉదయం శిబిరంలో సహాయ ఏఎన్ఓ గా వ్యవహరిస్తున్నారు. ఈ శిక్షణకు 13 మంది ఏఎన్ఓ లు, భారత వైమానిక దళం, సైన్యంలోని 16 మంది సిబ్బంది, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి చెందిన సివిల్ సిబ్బంది మద్దతు అందిస్తున్నారు. క్యాడెట్లలో క్రమశిక్షణ, ఐక్యత, నాయకత్వ లక్షణాలను అభివృద్ధి చేయడం ఈ శిబిరపు ప్రధాన ఉద్దేశ్యమని కేర్ టేకింగ్ ఆఫీసర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో క్యాడె ట్లకు యోగా శిక్షణ, యాంటీ టొబాకో డే పాటించడం, ప్రమాదాలపైన డ్రిల్స్, పారిశుధ్యం, ఆరోగ్యంపై వర్క్‌షాప్‌లు, సైబర్ భద్రత, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించనున్నట్లు అధికారులు తెలిపారు. శారీరక దృఢత్వాని పెంపొందించ డానికి హెల్త్ రన్, వ్యాయామాలు, షటింగ్, వ్యాస రచన, చిత్రలేఖనం, సాంస్కృతిక పోటీలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శిక్షణ అధికారి లక్ష్మీ నరసింహ, ఉపేందర్ రెడ్డి, సి ప్రియ, హేమలత, శిరీష, పాల్గొన్నారు.

'అమర' ఆధ్వర్యంలో నేడు సిపిఆర్‌పై శిక్షణ

శిక్షణపై అందరికీ అవగాహన అవసరం : ఆర్‌టివో

జిల్లా రవాణా శాఖ అధికారి కొర్రపాటి మురళీమోహన్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ప్రపంచ అత్యవసర వైద్య దినోత్సవాన్ని పురస్కరించుకొని తిరుపతి-కరకంబాడి మార్గంలోని రవాణా శాఖ కార్యాలయంలో మంగళవారం అమర హాస్పిటల్ ఆధ్వర్యంలో కార్డియో పల్మనరీ రిససిటేషన్ (సిపిఆర్), బేసిక్ ఫస్ట్ ఎయిడ్ స్కిల్స్‌పై శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు జిల్లా రవాణా శాఖ అధికారి కొర్రపాటి మురళీమోహన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆర్‌టివో కొర్రపాటి మురళీమోహన్ మాట్లాడుతూ అత్యవసర సమయాలలో ప్రాణాలు నిలబెట్టే నైపుణ్యాలను ప్రజలు అవగాహన కార్యక్రమాల ద్వారా తెలుసుకొని, ప్రమాదంలో ఉన్న వారి ప్రాణాలను రక్షించాలన్నారు. వరల్డ్ ఎమర్జెన్సీ మెడిసిన్ డే 2025 థీమ్‌గా క్లిష్టమైన పరిస్థితులలో అత్యవసర సేవలపై మెలగాల్సిన పద్ధతులను ఈ కార్యక్రమంలో వివరిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమ ప్రారంభానికి అమర హాస్పిటల్ ఆర్థోపెడిక్ విభాగాధిపతి డాక్టర్ ప్రసాద్ గౌరినేని, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రమాదేవి గౌరినేని, చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ భాగ్యలక్ష్మి, అమర ఆసుపత్రి అత్యవసర విభాగాధిపతి డాక్టర్ శివరామ కృష్ణారెడ్డి హాజరై కార్యక్రమ ప్రాధాన్యతను వివరిస్తారన్నారు. .

ఏఎన్‌ఎం, ఆశాలకు శిక్షణ

ఏఎన్‌ఎం, ఆశా కార్యకర్తలకు శిక్షణ ఇస్తున్న వైద్యాధికారులు

ప్రజాశక్తి- తిరుపతి సిటీ : తిరుపతి జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయం సమావేశ మందిరంలో జననీ మిత్ర యాప్‌పై ఎఎన్ఎం, ఆశ కార్యకర్తలకు సోమవారం శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా స్టేట్ అడిషనల్ డైరక్టర్ డాక్టర్ అనిల్ కుమార్ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా జననాల రేటు క్రమంగా తగ్గిపోతున్న ఈ సందర్భంలో, మన దేశంలోనూ ఈ సమస్య ఎదుర్కొనే అవకాశాలు ఉన్నాయన్నారు. ఈ నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల్లో గర్భిణుల ఆరోగ్యం మెరుగుకు, వారి పర్యవేక్షణను సులభతరం చేయడానికి "జననీ మిత్ర' యాప్ ను పరిచయం చేశామని తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బాలకృష్ణ నాయక్ మాట్లాడుతూ ఈ యాప్ ద్వారా మహిళల ఆరోగ్య పరిస్థితులపై అత్యంత శీఘ్ర, నిరంతర పర్యవేక్షణ చేపడుతుందని తెలిపారు. ఈ యాప్, సాంకేతికత ఆధారంగా, గర్భిణుల ఆరోగ్యాన్ని, ఆహారపు పోషక విలువలను, వైద్య పరీక్షలు, మందుల నియమాలు, ఇతర ఆరోగ్య సమస్యలను ముందుగానే గుర్తించడానికి ఉపయోగపడుతుందన్నారు. సంయుక్త ఫౌండేషన్ ఐటిహెడ్ శ్రీగౌరవ్ (ఎఐజి,ఎఐమ్) శిక్షణ గురించి మాట్లాడుతూ ఈ యాప్ గర్భిణుల ఆరోగ్య పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించి అవసరమైన చర్యలను, రక్తహీనత వంటి సాధారణ సమస్యలను ముందే గుర్తించి, నివారణ చర్యలు సూచిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డిపిఎమ్ఓ డాక్టర్ శ్రీనివాసరావ్, డిప్యూటి డిఎమ్ హెచ్ ఓలు డాక్టర్ మృదుల వాణి, డాక్టర్ మురళి కృష్ణ, డిఐఓ ఇన్‌చార్జ్ డాక్టర్ ఛత్ర ప్రకాష్ రెడ్డి, ప్రోగ్రాం కో ఆర్డినేటర్స్ క్రాంతి కుమార్, మనోజ్ కుమార్, డిప్యూటీ డెమోలు కిరణ్ కుమార్, ఖాజావలి, ఎస్ ఓ నాగేంద్ర కుమార్, దామినేడు, మంగళం, రేణిగుంట, కమ్మపల్లి పిహెచ్ సి ల వైద్యాధికారులు, ఏఎన్ ఎమ్‌లు, ఆశ కార్యకర్తలు ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యేలకు సన్మానం

నగరి ఎమ్మెల్యేను సన్మానిస్తున్న రేషన్ షాపు డీలర్లు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : రేషన్ మొబైల్ వాహనాలు రద్దు చేసి, డీలర్లకు పాత విధానాన్ని మళ్లీ అమలు చేసినందుకు నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్‌కి వడమాలపేట రేషన్ డిపో అసోసియేషన్ సభ్యులు సోమవారం ఎమ్మెల్యే ఇంటి వద్దకు చేరుకుని రేషన్ డీలర్లు ఘనంగా సన్మానించి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ మాట్లాడుతూ వృద్ధులకు, వికలాంగులకు రేషన్ సరఫరా విషయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండానే వారి నివాసాల వద్దకే సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని, డీలర్లకు సూచించారు. ఎమ్మెల్యే కు రేషన్ డీలర్లు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వడమాల పేట రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

గూడూరు ఎమ్మెల్యేను సన్మానిస్తున్న రేషన్ షాపు డీలర్లు

గూడూరు టౌన్ : రేషన్ దుకాణాల ద్వారా పేదలకు బియ్యం, ఇతర వస్తువులు పంపిణీ చేయాలని ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ సూచించారు. జూన్ ఒకటో తేదీ నుండి డీలర్ల ద్వారానే బియ్యం పంపిణీ చేయాలని ప్రభుత్వం ఆదేశాలివ్వడంతో డీలర్లు గూడూరు లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి ఘనంగా సన్మానించారు.

మహానాడును జయప్రదం చేయాలి: ఎమ్మెల్యే

మాట్లాడుతున్న గూడూరు ఎమ్మెల్యే సునీల్‌కుమార్

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : కడపలో నిర్వహించనున్న మహానాడును విజయవంతం చేయాలని ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ పిలుపునిచ్చారు. గూడూరు పట్టణంలోని గమళ్ళపాళెం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ మహానాడు విజయవంతంపై పార్టీ నాయకులతో సమావేశమయ్యారు. మహానాడుకు జన సమీకరణ చేసి విజయవంతం చేయాలని కోరారు. నియోజకవర్గం నుండి ఐదు వేల మందికి వచ్చేలా నాయకులు చొరవ తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు శీలం కిరణ్ కుమార్, పులిమి శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు రాజు, భాస్కర్ రెడ్డి, కిషోర్ నాయుడు, వాటంబేటి శివకుమార్, లీలావతి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న టిడిపి నాయకులు గాలి చలపతినాయుడు

శ్రీకాళహస్తి: కడపలో ఈ నెల 27వ తేదీ నుండి నిర్వహించనున్న టీడీపీ మహానాడును జయప్రదం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శులు గాలి చలపతి నాయుడు, డాక్టరు జి దశరధాచారి సోమవారం సంయుక్తం గా పిలుపు నిచ్చారు. లక్షలాదిగా టిడిపి కార్యకర్తలు తరలివచ్చి, తెలుగుజాతి ఐక్యతను ప్రపంచానికి మరోసారి చాటి చెప్పాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మిన్నల్ రవి, గాలి మురళి నాయుడు, ఉమేష్ రావు పాల్గొన్నారు.

నాయుడుపేట: ఈనెల 27,28,29 తేదీల్లో కడపలో జరగనున్న మహానాడును విజయవంతం చేయాలని సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ పిలుపునిచ్చారు. సోమవారం నాయుడుపేట పట్టణంలోని టిడిపి కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ కార్యకర్తలు నాయకులు తరలివచ్చి మహానాడుకు విజయవంతం చేయాలని కోరారు. సూళ్లూరుపేట నియోజకవర్గం నుండి మంగళవారం 2వేల మంది కార్యకర్తలు తరలి వెళ్తున్నట్లు తెలిపారు. చివరి రోజున 5వేల మంది తరలి రావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ సూళ్లూరుపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ నెలవల.సుబ్రహ్మణ్యం, మాజీ ఏఎంసి చైర్మన్ శిరసనం భేటీ విజయభాస్కర్ రెడ్డి, నాయుడుపేట మండలం టీడీపీ అధ్యక్షులు సన్నారెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, నాయుడుపేట మాజీ జడ్పిటిసి పేరంశెటి శ్రీరాం ప్రసాద్, పాల్గొన్నారు.

టీడీపీతోనే మైనారిటీల అభివృద్ధి

రాష్ట్ర మైనారిటీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి షాకీర్ అలీ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: మైనారిటీల అభివృద్ధి టీడీపీతోనే సాధ్యపడుతుందని రాష్ట్ర మైనారిటీ సెల్ కార్యనిర్వాహక కార్యదర్శి షాకీర్ అలీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో మైనారిటీల సంక్షేమ పథకాలన్నీ నిర్వీర్యమై పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సంక్షేమ పథకాలు మళ్లీ ప్రాణం పోసుకున్నాయని కొనియాడారు. మైనారిటీ పేదల కోసం సబ్సిడీ రుణాలు ప్రభుత్వం విడుదల చేసిందని, ముస్లిం మైనార్టీ సోదరులు గడువులోగా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. కుల ధృవీకరణ పత్రంతో సంబంధం లేకుండా, రేషన్ కార్డు, ఆధార్ కార్డులతోటి దరఖాస్తు చేసుకున్నా సరిపోతుందని తెలిపారు.

యోగాపై అవగాహనా సదస్సు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : స్థానిక పుత్తూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో యోగాపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి చంద్రమౌళి మాట్లాడుతూ యోగా వల్ల శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగుపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో టి నరసింహులు, డాక్టర్ డాక్టర్ టి రఘురామన్, టి కిషోర్ బాబు, అధ్యాపకులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

బుచ్చినాయుడు కండ్రిగ: బుచ్చినాయుడు కండ్రిగ మండలంలో ఈ నెల 27వ తేదీ నుంచి స్థానిక స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో యోగాంధ్ర ప్రారంభం అవుతుందని ఎంపిడివో వెంకటరత్నమ్మ పేర్కొన్నారు. మండలంలో 18 సచివాలయాలు, నాలుగు క్లస్టర్‌లకు సంబంధించి ఎంఓటిలుగా తహశీల్దారు శ్రీ దేవి, ఎంఈవో రవీంద్రనాథ్, వ్యవసాయ ఏవో భారతి, ఈవో అండ్ ఆర్డి రాజశేఖర్‌ను నియమించారన్నారు. ఒక్కో క్లస్టర్‌కు 75 మందికి మాస్టర్స్ ట్రైనర్స్ శిక్షణ ఇస్తారని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది , ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుండి పోటీలు

గూడూరు టౌన్ : గూడూరు పురపాలక సంఘ పరిధిలో వార్డు లెవెల్ యోగా పోటీలు సోమవారం నుండి ప్రారంభ మయ్యా యని ఇవి 31వ తేదీ వరకు జరుగుతాయని వీటిలో విజేతలైన వారిని మున్సిపల్ లెవెల్, డిస్ట్రిక్ట్ లెవెల్, స్టేట్ లెవెల్ పోటీలకు ఎంపిక చేస్తారని తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనా లనుకున్న వారు, మీ దగ్గరలోని సచి వాలయంలో పేరు నమోదు చేసుకుని పాల్గొన వచ్చుని కమిషనర్ పేర్కొన్నారు.

పుత్తూరు టౌన్ : పుత్తూరు పురపాలక సంఘం వార్డు సచివాలయాల పరిధిలో యోగా పోటీలు నిర్వహించ నున్నట్లు పుత్తూరు పురపాలక సంఘ కమిషనర్ మంజునాథ్ గౌడ తెలిపారు. ఈ నెల 27వ తేదీ నుండి 31వ తేదీ వరకు యస్ఆర్‌యస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పుత్తూరు పురపాలక సంఘం, హిమజ డిగ్రీ కళాశాల, కల్యాణపురంలో యోగా శిక్షణ నిర్వహిస్తామని తెలిపారు.

క్రైం న్యూస్

అదుపు తప్పి కారు బోల్తా

ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి -పెళ్లకూరు: అదుపు తప్పి కారు బోల్తా పడిన ప్రమాదంలో ఇద్దరు గాయపడిన సంఘటన మండలంలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. నెల్లూరు నవాబుపేట ప్రాంతానికి చెందిన నాసిన రమణయ్య, నాసిన పోలమ్మలు కుమారుడు బ్యాంకు అసిస్టెంటు మేనేజర్ చంద్రశేఖర రెండు నెలల క్రితం వేలూరుకి వెళ్లాడు. సోమవారం తిరిగి నెల్లూరుకు వెళుతున్న సమయంలో పెన్నేపల్లి వద్ద వేగంగా వెళుతున్న కారు అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో నాసిన రమణయ్య , పోలమ్మల తలకు, శరీరానికి బలమైన గాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసు వారిని 108 సాయంతో నాయుడుపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం చెన్నయ్‌కి తరలించినట్లు తెలిపారు.

ఏటీఎం కార్డు మార్చి నగదు చోరీ

రూ.15 వేలు తస్కరించిన ఘనుడు

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: ఏటీఎం వద్ద డబ్బులు డ్రా కోసం ఓ వ్యక్తిని ఆశ్రయించిన మహిళ నుంచి ఏటీఎం కార్డు మార్చి, గుర్తు తెలియని వ్యక్తి రూ.15 వేల రూపాయలు నగదు కాజేసిన ఘటన తిరుపతిలో సోమవారం చోటు చేసుకుంది. బాధితురాలి కథనం మేరకు..టీటీడీ ఉద్యోగి వేలు భార్య సంగీత ఏటీఎం ద్వారా డబ్బులు డ్రా చేసేందుకు టీటీడీ ఏడి బిల్డింగ్ ఎదురుగానున్న యూనియన్ బ్యాంక్ ఎటిఎం వద్దకు వెళ్లింది. మొదట 20 వేల రూపాయలు డ్రా చేసింది. మరోసారి 15 వేల రూపాయలు డ్రా చేసే ప్రయత్నంలో నగదు రాక పోవడంతో, ఎటిఎంలో వెనుకనున్న అజ్ఞాత వ్యక్తి సహకారం కోరింది. ఇదే అదునుగా భావించిన అతను, ఆయనకు సహాయం చేసినట్లు చేసి, ఆమె ఏటీఎం కార్డును మార్చి ఇచ్చాడు. అనంతరం ఆమె అక్కడ నుంచి వెళ్లిన తర్వాత అదే ఏటీఎంలో ఐదు వేల రూపాయల నగదు డ్రా చేశాడు. అక్కడి నుండి చిత్తూరుకు వెళ్లి మరో రూ.10 వేలు చిత్తూరు కెఆర్ ఫిల్లింగ్ స్టేషన్‌లో డ్రా చేశాడు. తన ఏటీఎం నుంచి రూ.15 వేలు డ్రా చేశారని బాధితురాలు ఫోన్‌కు మెసేజ్ వచ్చింది. దీంతో అప్రమత్తమైన సంగీత తన ఖాతా నుండి మిగిలిన సొమ్ము భర్త అకౌంట్‌కు పంపింది. అనంతరం బ్యాంకు అధికారుల సూచనల మేరకు బాధితురాలు అలిపిరి పోలీసులను ఆశ్రయించింది.

గంజాయి విక్రేతల అరెస్టు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : పట్టణ శివారు ప్రాంతంలో ఉన్న రింగ్ రోడ్డులో గంజాయి విక్రయిస్తున్న ముగ్గురు వ్యక్తులను సోమవారం రాత్రి టూ టౌన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. టూ టౌన్ సీఐ నాగార్జున రెడ్డికి వచ్చిన రహస్య సమాచారం మేరకు ఎంజీఎం హాస్పిటల్ సమీపంలోని రింగ్ రోడ్డు వద్ద కాపు కాసిన పోలీసులకు గంజాయి విక్రయిస్తున్న వ్యక్తులు కనిపించారు. వారి వద్ద నుంచి సుమారు 15 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. స్టేషన్‌కి తరలించి విచారిస్తున్నట్లు సీఐ తెలిపారు. విచారణలో మరి కొంతమంది గంజాయి విక్రేతలను అదుపులోకి తీసుకునే అవకాశం ఉందని తెలిపారు.

శ్రీవారి భక్తుల కోసం రైల్వే, టీటీడీ సమన్వయం

ప్రజాశక్తి -తిరుపతి టౌన్:

తిరుమల శ్రీవారి దర్శనానికి టిటిడి ఇటీవల ఆగస్టు నెల ఆన్‌లైను కోటాను విడుదల చేసింది. దేశ విదేశాల నుంచి వేలాది మంది భక్తులు క్షణాల్లోనే టికెట్లు బుక్ చేసుకున్నారు. గతంలో ఎన్నో ప్రయత్నాలు చేసినా టికెట్లు దక్కని భక్తులు, ఈసారి పొందడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఆగస్టు నెల టిటిడి దర్శన టికెట్లు పొందిన భక్తులు, రైల్వే రిజర్వేషన్ టికెట్లు జూన్‌లో బుక్ చేసుకోవచ్చు. శ్రీవారి దర్శనార్థం తిరుమలకు చేరుకునే భక్తుల సౌలభ్యం కోసం రైల్వే శాఖ ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది. తక్కువ ఖర్చుతో, సౌకర్యవంతంగా ప్రయాణించే మార్గంగా రైలు ప్రయాణం ఉత్తమ ఎంపికగా నిలుస్తోంది. భక్తుల రద్దీ పరిస్థితిని దృష్టిలో వుంచుకుని వివిధ ప్రాంతాల నుంచి తిరుపతికి ప్రత్యేక రైళ్లను నడిపేందుకు రైల్వే శాఖ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఉన్నతాధికారుల సమన్వయంతో తగిన ఏర్పాట్లు జరుగుతున్నాయని తిరుపతి రైల్వే స్టేషన్ డైరెక్టర్ కుప్పాల సత్యనారాయణ తెలిపారు. తాత్కాలికంగా నడిపే ఈ ప్రత్యేక రైళ్ల ద్వారా భక్తులు సులభంగా రైలు టికెట్లు పొందవచ్చని, ఎలాంటి నిరుత్సాహం అవసరం లేదని రైల్వే అధికారులు తెలిపారు.

శ్రీసిటీని సందర్శించిన థాయిలాండ్ కాన్సుల్ జనరల్

పెట్టుబడి అవకాశాల పరిశీలన

ప్రజాశక్తి -వరదయ్యపాలెం: చెన్నైలో ని రాయల్ థాయ్ కాన్సుల్ జనరల్ రాచా అరిబార్గ్ సోమవారం శ్రీసిటీ ని సందర్శిం చారు. తన భార్య నరఫాన్ అరిబార్గ్, కాన్సుల్ పిన్‌పాంగ్ చౌవాచాటాతో కలసి రెండు రోజుల పర్యటనకు విచ్చేసిన ఆయనకు శ్రీసిటీ ప్రెసిడెంట్ (ఆపరేషన్స్) సతీష్ కామత్ సాదర స్వాగతం పలికారు. ఈ సందర్భంగా శ్రీసిటీ అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ (బిజినెస్ డెవలప్‌మెంట్) బోడ్గన్ జార్జ్ శ్రీసిటీలోని థాయిలాండ్ పరిశ్రమ రాక్‌వర్త్ స్థాపన, ప్రస్థానాన్ని కాన్సుల్ జనరల్ బృందం దృష్టికి తెచ్చారు. శ్రీసిటీ ప్రగతి, ప్రత్యేకతలు, అంతర్జాతీయ మౌలిక సదుపాయాలు, పారిశ్రామిక అనుకూల వాతావరణం, వ్యాపార ప్రయోజనాలను వివరించారు. రాష్ట్ర పారిశ్రామిక విధానం, తద్వారా నిర్మితమవుతున్న బలమైన తయారీ పర్యావరణ వ్యవస్థ గురించి వివరించారు. థాయిలాండ్ వ్యాపార ప్రతినిధులు శ్రీసిటీలోని వ్యాపార అవకాశాలను వీక్షించేలా చొరవ చూపాలని కాన్సుల్ జనరల్‌ను కోరారు. భారత్-థాయ్‌లాండ్ వ్యాపార సంబంధాలను పెంపొందిం చడంలో ఈ సందర్శన కీలక పాత్ర పోషిస్తుందన్న శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి పేర్కొన్నారు. మొదటి రోజు పర్యటనలో శ్రీసిటీ అధికారులతో చర్చలు, పారిశ్రామికవాడ పరిసరాల వీక్షణతో పాటు స్థానిక రాక్‌వర్త్, మోండలెజ్ పరిశ్రమలను ఆయన సందర్శిం చారు. కంపెనీ ప్రతినిధులతోను సమావేశ మయ్యా రు. రెండవ రోజు పర్యటనలో బ్లూస్టార్, మురుగప్ప గ్రూప్ కంపెనీ లను ఆయన సందర్శించనున్నారు.

In the Court of the Principal Junior Civil Judge : Nellore

O.S.No. 919 / 2023

Duggiraju Suseela - Plaintiff

Vs

Chavanaboyina Sreepathi Babu - Defendant

Notice to Defendant

Chavanaboyina Sreepathi Babu,
S/o **C.V. Ramanaiah,**
Residing at Door No.6-42/1,
Akkarampalli, Thirupathi Town & District.

పై నెంబరున వాది మీ నుండి ప్రామిసరి నోట్లు బాకీ రాబట్టుకొనుటకు పై తెలిపిన కోర్టులో మీపై దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో మీకు నోటీసు నిమిత్తం **తే23-06-2025ది** కి వాయిదా వేసియున్నారు. కావున వాయిదా రోజు ఉదయం **10.30** గంటలకు మీరు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పై తెలిపిన కోర్టులో హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలసినది. లేని యెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.

ఎ.వేంకట మురళీ కృష్ణ, బి.ఎ., బి.ఎల్.,
వాది తరపు అడ్వకేట్, నెల్లూరు.

విశేష సంఖ్యలో భక్తులకు శ్రీవారి దర్శనం

- వేసవి రద్దీ దృష్ట్యా విస్తృత ఏర్పాట్లు

- భక్తులకు నిరంతరాయంగా అన్న, పానీయాల పంపిణీ

ప్రజాశక్తి -తిరుమల: వేసవి రద్దీ నేపథ్యంలో తిరుమలలో టీటీడీ విస్తృత ఏర్పాట్లు చేపట్టింది. రద్దీ కారణంగా దర్శన సమయం ఆలస్యమవు తున్నప్పటికీ భక్తులకు ఎలాంటి ఇబ్బంది తలెత్తకుండా చర్యలు తీసు కోవడంతో అధిక సంఖ్యలో భక్తులకు స్వామివారిని దర్శించుకుంటున్నారు. దర్శన క్యూలైన్లలో శ్రీవారి సేవకుల ద్వారా భక్తులకు అన్న, పానీయాలను నిరంతరాయంగా పంపిణీ చేస్తున్నారు. అన్నీ విభాగాల అధికారుల సమన్వయంతో పని చేస్తూ భక్తులకు త్వరితగతిన దర్శనం అయ్యేందుకు కృషి చేస్తున్నారు. విజిలెన్స్, ఆలయ విభాగాలు సమర్థవంతంగా క్యూలైన్లను నిర్వహిస్తుండటంతో సాధారణ రోజుల్లో కంటే 10వేల మంది వరకు భక్తులకు అదనంగా దర్శనం కానుంది. ఈ నేపథ్యంలో గత నాలుగు రోజుల్లో (గురు, శుక్ర, శని, ఆదివారాల్లో) శ్రీవాణి దర్శనాలు కొనసాగుతున్నపటికీ కూడా 3,28,702 మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. అన్న ప్రసాదం విభాగం ద్వారా 10,98,170 మంది భక్తులకు అన్న ప్రసాదాలు అందించగా, 4,55,160 మంది భక్తులకు పానీయాలు (టీ, కాఫీ, పాలు, మజ్జిగ) అందించారు. ఈ నాలుగు రోజుల్లో 1,52,587 మంది భక్తులు తలనీలాలు సమర్పించగా, టీటీడీ వైద్య విభాగం ద్వారా తిరుమలలోని వివిధ ప్రాంతాల్లో 12,172 మంది భక్తులు వైద్య సేవలు పొందారు. క్యూలైన్లలో ఆరోగ్యశాఖ నిరంతరాయంగా తాగునీటి సరఫరా, పరిసరాల పరిశు భ్రతను నిర్వహిస్తోంది. మొత్తం 2,150 మంది శానిటరీ కార్మికులు, సూపర్వైజర్లు, మైస్త్రీలు, ఇన్స్పెక్టర్లు, యూనిట్ అధికారులు భక్తుల కోసం మూడు షిఫ్టుల్లో 24 గంటలు సేవలు అందిస్తున్నారు. టీటీడీలోని ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు క్యూలైన్లను పర్యవేక్షిస్తూ భక్తులకు అందిస్తున్న సౌకర్యాలను పర్యవేక్షిస్తున్నారు.

గోవర్ధన్ రెడ్డి అరెస్టుతో వెలుగులోకి కుట్ర: నరసింహ యాదవ్

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): మాజీ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి అక్రమ మైనింగ్ జరుపుతూ వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డికి నిధులు సమకూర్చారని, అక్రమ మైనింగ్ కేసుకు సంబంధించి తన పేరు ఉందని తెలుసుకున్న గోవర్ధన్ రెడ్డి తప్పించుకొని తిరుగుతూ ఊళ్లు మారుతుండగా పోలీసులు అరెస్టు చేశారని, ఈ అరెస్టుతో కుట్ర వెలుగులోకి రానుందని రాష్ట్ర యాదవ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ గొల్ల నరసింహ యాదవ్ అన్నారు. సోమవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్ల పాలనలో సర్వేపల్లి నియోజకవర్గం లోని గనులకు సంబంధించి అక్రమంగా తవ్వుతున్నారన్న అంశంపై టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ఆధ్వర్యంలో నిరసన చేస్తే అక్రమ కేసులు పెట్టి ఇబ్బందులకు గురి చేశారన్నారు. ఇప్పుడు మాజీ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి అరెస్టుతో అక్రమ గనుల తవ్వకాలకు సంబంధించిన నిధులు ఎక్కడికి వెళ్లాయన్న అంశాలు ప్రజలకు తెలుస్తాయన్నారు. మహానాడు కార్యక్రమాన్ని కడపలో ఘనంగా నిర్వహిస్తున్నామన్నారు. మంత్రి లోకేష్‌ను టిడిపి జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ గా ఎన్నుకోవాలని, తిరుపతిలో ఎన్టీఆర్ స్మారక భవనాన్ని నిర్మించాలని తిరుపతి పార్లమెంటు మహానాడులో తీర్మానం చేశామన్నారు. ఈ సమావేశంలో నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ ఆర్ సి మునికృష్ణ, హేమంత్ యాదవ్, భరణి యాదవ్, జయరామ్ యాదవ్, మహేష్, కుమార్, రామారావు పాల్గొన్నారు.

తెలుగు భాషా పరిరక్షణపై తీర్మానం చేయాలి

ప్రజాశక్తి- గంగవరం: తెలుగుదేశం పార్టీ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మహానాడు కార్యక్రమంలో తెలుగుభాషా రక్షణకు సంబంధించి తీర్మానం చేయాలని తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షులు పి.తులసినాథం నాయుడు కోరారు. ఈ మేరకు పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు వర్ల రామయ్యను సోమవారం తిరుపతిలో కలిసి వినతి పత్రం అందించారు. తీర్మానాల కమిటీ దృష్టికి తీసుకువెళ్తానని ఆయన హామీ ఇచ్చారన్నారు.

మావోయిస్టుల మృతదేహాలను బంధువులకు అప్పగించాలి: హరినాథ రెడ్డి

మాట్లాడుతున్న సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు హరనాథరెడ్డి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): సిపిఐ మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి నంబాల కేశవరావు తో సహా ఆ పార్టీ నాయకులు ఆదివాసీల్ని హతమార్చిన మోడీ ప్రభుత్వ పాసిస్ట్ చెదలను ఖండిస్తూ మావోయిస్టుల మృతదేహాలను వారి బంధువులకు తక్షణమే అప్పగించాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు హరినాథ రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ పేరుతో దళిత ఆదివాసీలను హత్యలు చేయడం చేస్తూ మావోయిస్టు అంతం చేస్తున్నామని వేడుకలు జరుపుకోవడం దారుణ మని, ప్రధాని ప్రజల కోసం పనిచేసే వారిని చంపడాన్ని ఆనందించడం ఆటవిక చర్యగా పరిగణిస్తున్నామన్నారు. అడవులలో సాగుతున్న మారణకాండపై దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరపాలని, తక్షణమే ఆపరేషన్ కగార్ ను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. అపారమైన ఖనిజ సంపదను బడా కార్పొరేట్లకు అప్పగించే ప్రయత్నంలో భాగమే ఈ ఆపరేషన్ కొనసాగుతోందని స్పష్టంగా అర్థమవు తుందన్నారు. మనుషులను చంపుతారే గాని మావోయిస్టుల ఆలోచన విధానాన్ని, సిద్ధాంతాలను చంపలేరని కేంద్ర ప్రభుత్వ పెద్దలు గుర్తుపెట్టు కోవాలన్నారు. హైకోర్టు అనుమ తులు ఇచ్చిన మృతదేహాలను బంధువులకు అప్పగించకపోవడంపై కోర్టు ధిక్కరణగా పోలీసులపై చర్యలు చేపట్టాలన్నారు. ఈసమావేశంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్నం పెంచలయ్య, కేతారి రాధాకృష్ణ, ఉదయ్ కుమార్, ఎఐటియుసి జిల్లా నాయకులు పాల్గొన్నారు.

'నారాయణ'లో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : నారాయణ ఇంజనీరింగ్ కళాశాల లో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగం జూన్ 15 నుండి 20 వ తేదీ వరకు "వి.యల్.యస్.ఐ. లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అప్లికేషన్స్ అనువర్తనాల్లో ఇటీవలి పురోగతులు , సవాళ్లు' పై 6 రోజుల అల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ ట్రైనింగ్ అండ్ లెర్నింగ్ ప్రాయోజిత ఫాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం ఆరు రోజుల వరకు నిర్వహించనున్నట్లు ఆ కళాశాల డైరెక్టర్ డాక్టర్ దత్తాత్రేయ శర్మ పేర్కొన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం అల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ ట్రైనింగ్ అండ్ లెర్నింగ్ ముఖాముఖీ అనే పథకం కింద ఏఐసిటిఈ, న్యూ ఢిల్లీ వారు మంజూరు చేశారని తెలిపారు. భారతదేశం అంతా దాదాపు 4,400 కళాశాలలు దరఖాస్తు చేసుకోగా 403 కళాశాలలు మాత్రమే అందుకున్నాయన్నారు. ఆంధ్రప్రదేశ్ నుండి కేవలం 23 కళాశాలలు మాత్రమే ఈ గ్రాంటు పొందాయని తెలిపారు. ఈ ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రాం నిర్వహించడానికి కింద ఏఐసిటిఈ మొదటి విడత గా మూడు లక్షల యాభై వేలు గ్రాంట్ ను కూడా విడుదల చేసిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రవి ప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగాధిపతి వై నీరజ, కో ఆర్డినేటర్ కె. హెచ్‌శక్తి మురుగన్, మాలకొండ రెడ్డి పాల్గొన్నారు.

వైసీపీని మరింత బలోపేతం చేయాలి

ప్రజాశక్తి -తిరుపతి సిటీ : వైసిపినిని క్షేత్రస్థాయి నుంచి సంస్థాగతంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా పంచాయతీ పార్టీ అధ్యక్షులు పనిచేయాలని చంద్రగిరి నియోజక వర్గం వైసిపి ఇన్‌చార్జి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి స్పష్టం చేశారు. తిరుపతి రూరల్ మండలం పరిధిలోని పంచాయతీలకు పార్టీ అధ్యక్షులుగా కొత్తగా నియమితులైన వారితో సోమవారం తుమ్మలగుంటలో సమావేశం నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షుడు మునీశ్వర్ రెడ్డి ఏర్పాటు చేసుకున్న ఈ సమావేశానికి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి హాజరై మాట్లాడుతూ ఇకపై గ్రామ పంచాయతీ అధ్యక్షులకు పార్టీ కార్యక్రమాల్లో అత్యంత ప్రాధాన్యత కలిగించేలా చూస్తామన్నారు. ప్రతి పంచాయతీలో పార్టీ కార్యక్రమాలు జరిగేలా చూడాలని, మండలం స్థాయిలో జరిగే పెద్ద కార్యక్రమాలకు గ్రామ పంచాయతీల నుంచి అధ్యక్షులు అందరూ హాజరు కావాలన్నారు. గ్రామ స్థాయి నుంచి పార్టీ కమిటీల నియామకం మొదలు పెట్టి రాష్ట్ర కార్యవర్గం ఏర్పాటుతో ఆ ప్రక్రియను ముగించాలని పార్టీ అధినేత జగనన్న నిర్ణయించడం పార్టీ పురోభివృద్ధికి శుభ పరిణామం అన్నారు. ప్రతి పంచాయతీలో పార్టీని బలపరిచేలా కష్ట పడాలని, పార్టీ ప్రతి పక్షంలో ఉన్నపుడు అండగా నిలబడ్డ ఏ ఒక్కరికీ అధికారం వచ్చాక అన్యాయం జరగకుండా చూసే బాధ్యత తాను తీసుకుంటానని హామీ ఇచ్చారు. పంచాయతీలో ఒక కార్యకర్తకు కష్టం వస్తే మండలంలో ఉన్న పార్టీ నేతలు అందరూ ఏకం కావాలని, అక్కడ జరిగే అన్యాయాన్ని ఎదురించడానికి ఐక్యతతో గట్టిగా నిలబడలన్నారు. అప్పుడే పోలీసులు, అధికారులు చట్టాన్ని అతిక్రమించి పని చేయడానికి ఆలోచన చేస్తారన్న విషయం అందరూ గుర్తు పెట్టుకోవాలని సూచించారు.

రూరల్ అధ్యక్షులకు చెవిరెడ్డి మోహిత్ రెడ్డి సూచన

మాట్లాడుతున్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

గ్రామాలల్లో పార్టీ కార్యకర్తల మధ్య ఏదేనీ విద్వేషాలు ఉన్నట్లయితే వాటిని పూర్తిగా పక్కన పెట్టి పార్టీ బలోపేతానికి అందరూ ఏకతాటిపైకి రావాలన్నారు. వైసిపి జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షులు చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి పార్టీ అధ్యక్షులుగా నియమితులైన వారందరికీ అభినందనలు తెలిపారు. ఈ ప్రత్యేక సమావేశంలో రాష్ట్ర పార్టీ నాయకులు ఉపేంద్ర రెడ్డి, ఎంపీపీ మూలం చంద్రమోహన్ రెడ్డి, వైస్ ఎంపీపీ విడుదల మాదవ రెడ్డి, జడ్పీటీసీ రత్నమ్మ, పలువురు సర్పంచ్ లు, ఎంపీటీసీ లు హాజరయ్యారు.

కార్మికులతో మాట్లాడుతున్న ఎండీ ద్వారక తిరుమలరావు

ఆర్టీసీ ఖర్చులు తగ్గించి ఆదాయం పెంచండి

పుత్తూరు డిపో తనిఖీలో ఎండీ ద్వారక తిరుమలరావు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: ఆర్‌టిసి ఖర్చులు తగ్గించి ఆదాయం పెంచాలని సిబ్బందికి ఆర్‌టిసి ఎండీ ద్వారక తిరుమలరావు సూచించారు. పుత్తూరు ఆర్టీసీ డిపోను సోమవారం ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ ద్వారక తిరుమల రావు సందర్శించారు. పుత్తూరు డిపో మేనేజర్ ప్రశాంతి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఎండి ద్వారక తిరుమల రావు ఆర్టీసీ ఉద్యోగులు ఉద్దేశించి మాట్లాడుతూ డిపోలోని బస్సులు పటిష్టంగా ఉంటేనే అందరికి లాభ సాటి అన్నారు. ప్రతి ఆర్టీసీ డిపో లాభాల బాటలో నడిపించడం ఉద్యోగుల బాధ్యత అని తెలిపారు. ఆర్టీసీ ఉద్యోగులు ప్రయాణికులతో మంచి సఖ్యత భావం కలిగి ఉండాలని , ప్రయాణికులకు ఆర్టీసీ బస్సు పై నమ్మకం కలిగించాలని అప్పుడే లాభదాయకమైన ఆర్టీసీ వ్యవస్థ సాధిస్తామని తెలిపారు. అనంతరం ఆర్టీసీ బస్టాండ్‌ను పరివేక్షించారు. ఈ నేపథ్యంలో పాత్రికేయులతో మాట్లాడుతూ పుత్తూరు అభివృద్ధిలో ఆర్టీసీ శాఖ సేవను పునరుద్దిస్తామని హామీ ఇచ్చారు.

యోగా పోటీలు ప్రారంభం : కమిషనర్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్ 'యోగాంధ్ర క్యాంపెయిన్– యోగా పోటీ ప్రణాళిక' ప్రకారం నగర పాలక సంస్థ, జిల్లా, రాష్ట్ర స్థాయిలో యోగాపోటీలను నిర్వహిస్తున్నట్లు కమిషనర్ ఎన్.మౌర్య తెలిపారు. విద్యార్థులు, పౌరులు ఆరోగ్యకరమైన జీవనశైలిని అవలంబించేందుకు ప్రోత్సహిస్తున్నామన్నారు. ఈపోటీలు మే 26 నుంచి జూన్ 18 వరకూ నిర్వహిస్తామన్నారు.ఇందులో వ్యక్తిగత, గ్రూప్ ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు, జ్ఞానపరమైన పోటీలు నిర్వహిస్తామన్నారు. 26, 27 తేదీల్లో జూనియర్స్ (10–18 వయస్సు)కు, మిడిల్ ఏజ్, ఆపైన వారికి సోమవారం ఉదయం 7.30 నుంచి సాయంత్రం 6 గంటల వరకూ సోలో యోగా, అసనాస్, సూర్య నమస్కారం, ప్రాణాయామం, ధ్యానం నిర్వహించనున్నట్లు తెలిపారు. 28, 29 తేదీల్లో ఉదయం 7.30 నుంచి సాయంత్రం 6 గంటల వరకూ యోగా, యోగా సాంగ్స్, పెయింటింగ్, యోగా స్కిట్, రోల్‌ప్లే ఉంటుందన్నారు. 20న యోగా క్విజ్, పోస్టర్, స్లోగన్, షార్ట్‌ఫిల్మ్, ఫొటోగ్రఫీపై పోటీలు ఉంటాయన్నారు. పాల్గొనదలచిన వారు ఆయా సచివాలయ కార్యదర్శి దగ్గర రిజిస్ట్రేషన్ చేసుకోవాలని పేర్కొన్నారు.

మండలానికి రాయితీ వేరుశనగ విత్తనాలు

ప్రజాశక్తి- సోమల:

సోమల మండలంలోని 13 రైతు సేవా కేంద్రాలకు 819 క్వింటాళ్ల రాయితీ వేరుశనగ విత్తనాలు సోమవారం చేరుకున్నాయి. రైతు సేవ కేంద్రాలలో రాయితీ విత్తనాలు భద్రపరిచి ప్రభుత్వం ధర ప్రకటించగానే రైతులకు విక్రయించడం జరుగుతుందని సోమల వ్యవసాయశాఖ అధికారి సుధాకర్ తెలిపారు. కాగా కె6 రకానికి చెందిన వేరుశనగ విత్తనాలు మండలానికి చేరుకున్నాయని, గత ఏడాది 1400 క్వింటాళ్లు మండలానికి కేటాయించగా ఈ ఏడాది కేవలం 819 క్వింటాళ్లు మాత్రం మండలానికి కేటాయించారని తెలిపారు. మండలంలో ఖరీఫ్‌లో వేరుశనగ విత్తనాలు 812 హెక్టార్లలో సాగు చేయాల్సి ఉండగా గత ఏడాది 283 హెక్టార్లలో మాత్రమే సాగు చేయడంతో సాగు విస్తీర్ణం తగ్గిందని, దీంతో ప్రభుత్వం819 క్వింటాళ్లు రాయితీ వేరుశనగ విత్తనాలు సరఫరా చేసిందని తెలిపారు. ప్రభుత్వం రాయితీ వేరుశనగ విత్తనాల అమ్మకం విధివిధానాలపై ప్రకటన చేయగానే అమ్మకాలు ప్రారంభిస్తామని ఏవో తెలిపారు.